


APTEL/2015/65279

Postal Reg.No. MPM/L.22/VNEWS/25-27

# V న్యూస్

మన ఊరు - మన వార్తలు

తెలుగు దినపత్రిక

e-mail : vnewsmachilipatnam@gmail.com
e-mail : vnewsindia@gmail.com




సంపుటి :11 సంచిక : 268 మచిలీపట్నం, విజయవాడ, కాకినాడ, ఏలూరు, గుంటూరు, తెలంగాణ, వైఎస్ఆర్ కడప, ఒంగోలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు 15-04-2026 బుధవారం పేజీలు :8 వెల : రూ.3/-

# క్వాంటం టెక్నాలజీకి అమరావతి లాంచ్ పాడ్

**- ఔషధాల నుంచి క్రయోజెనిక్స్ వరకూ పరిశోధనలకు కేంద్రంగా క్వాంటం వ్యాలీ**

**- ఎస్ఆర్ఎం, మేధాటవర్స్‌లోని 1 ఎస్,1క్యూ క్వాంటం టెస్ట్‌బెడ్‌లను జాతికి అంకితం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి :** ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లో ఓ సరికొత్త టెక్ అధ్యాయం ప్రారంభమైంది. దేశంలోనే తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ ఆవిష్కృతమైంది. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, గన్నవరంలోని మేధా టవర్స్ వద్ద ఏర్పాటు చేసిన 1 ఎస్, 1 క్యూ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు. క్వాంటం టెక్నాలజీకి అమరావతిని లాంచ్ పాడ్‌గా మారుస్తామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీలను ప్రారంభించిన అనంతరం క్వాంటం రంగ నిపుణులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.."ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత మొట్టమొదటి క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీని ప్రారంభించటం సంతోషంగా ఉంది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 1ఎస్ ఓపెన్ యాక్సెస్ క్వాంటం ఫెసిలీటీ, మేధాటవర్స్‌లో 1 క్యూ పేరిట మరో క్వాంటం సిస్టం ఏర్పాటు చేశారు. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు, ప్రజలకు శుభాకాంక్షలు తెలియ చేస్తున్నాను. క్వాంటం సైన్స్ వంద ఏళ్లు పూర్తైన సందర్భంగా ప్రపంచ క్వాంటం దినోత్సవం రోజున దీన్ని సాకారం చేసుకుని చరిత్ర సృష్టించాం. విజ్ఞానమే సామాజిక ప్రగతికి చిహ్నం అని చెప్పిన అంబేద్కర్ గారి జయంతిని పురస్కరించుకుని అమరావతిలో క్వాంటం కంప్యూటర్ రిఫరెన్స్ ఫెసిలిటీని ప్రారంభించుకున్నాం. క్వాంటం టెక్నాలజీని పరిశోధకులకు, కంపెనీలకు, విద్యార్థులకు అందుబాటులో ఉంచేలా ఈ టెస్ట్ బెడ్‌లను ఏర్పాటు చేయటంపై అందరికీ అభినందనలు. భారత తొలి ఓపెన్-యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీలతో పాటు అమరావతి క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు ప్రోత్సహిస్తోన్న ప్రధాని మోదీకి ధన్యవాదాలు. ఏక్యూవీ ని వేగంగా పూర్తి చేయటంలో సహకరిస్తున్న కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, కార్యదర్శి అభయ్ కరాండికర్‌కు ధన్యవాదాలు. అమరావతిలో ప్రారంభమైన 1ఎస్ ,1 క్యూ క్వాంటం హార్డ్‌వేర్ టెస్ట్‌బెడ్స్ క్వాంటం ఉపకరణాలను పరీక్షించడానికి, సర్టిఫై చేయడానికి కీలకం. దేశంలోని తొలి క్వాంటం కంప్యూటర్లకు ఆంధ్రప్రదేశ్ వేదిక అయినందుకు గర్విస్తున్నాను. ఐటీ రంగంలో కీలక పాత్ర పోషించిన తెలుగు గడ్డ ఇప్పుడు క్వాంటం టెక్నాలజీకి వేదికగా మారటం సంతోషదాయకం" అని ముఖ్యమంత్రి అన్నారు.

**క్వాంటం రంగంలో ఆత్మనిర్భర్‌గా ఆంధ్రప్రదేశ్**

"పారిశ్రామిక రంగానికి విద్యుత్ కీలకం, డిజిటల్ యుగానికి ఇంటర్నెట్ అంతే ముఖ్యం, ఆధునిక ఆవిష్కరణలకు క్వాంటం టెక్నాలజీ ప్రధానం. క్వాంటం సాంకేతికతలో సాధికారిత సాధించిన దేశాలే భవిష్యత్తును శాసించే అవకాశం ఉంటుంది. భారతీయ పరిశోధకులకు క్వాంటం హార్డ్‌వేర్ పరీక్షించేందుకు అమరావతి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ ప్రధాన కేంద్రం అవుతుంది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలోని అమరావతి 1 ఎస్ కంప్యూటర్ పరిశోధనలకు, మేధా టవర్స్‌లోని అమరావతి 1క్యూ కంప్యూటర్ పారిశ్రామిక వినియోగానికి తోడ్పడతాయి. అమరావతిలో ఏర్పాటైన ఈ రెండూ టెస్ట్ ఫెసిలిటీలు క్వాంటం టెక్నాలజీలో దేశ సామర్థ్యాన్ని పెంచాయి. కేవలం 8 నెలల్లోనే క్వాంటం కంప్యూటింగ్ రిఫరెన్సు ఫెసిలిటీలు వాస్తవ రూపం దాల్చాయి. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో క్వాంటం కంప్యూటర్లను నిర్మించాలని నేను ఇచ్చిన సూచనల మేరకు ఇవి ఏర్పాటయ్యాయి. దేశానికి, ప్రపంచానికి కావాల్సిన క్వాంటం కంప్యూటింగ్ పరికరాలు కూడా ఇక్కడే తయారు చేసేలా కార్యాచరణ చేపట్టాం. ముంబైలోని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, పూణెలోని డీఆర్డీఓ సహా వివిధ సంస్థల భాగస్వామ్యంతో స్వదేశీ టెక్నాలజీతోనే ఈ క్వాంటం టెస్ట్ బెడ్‌లు సిద్ధమయ్యాయి. ఇక వ్యూహాత్మక టెక్నాలజీల్లో భారత్ ఇతర దేశాలపై ఆధారపడాల్సిన అవసరం లేదని భావిస్తున్నాను. దేశీయంగానే క్వాంటం ఉపకరణాలు తయారు చేయటం ఆత్మనిర్భర్ కార్యక్రమంలో కీలకమైన




అంశం. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో రూపొందించుకున్న 10 సూత్రాల్లో డీప్ టెక్ కూడా ఓ కీలకమైన అంశం" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

**డిసెంబరు నుంచి అమరావతి క్వాంటం వ్యాలీ**

"కృష్ణా నదీ తీరంలో ప్రజా రాజధాని అమరావతిని బ్లూ-గ్రీన్ సిటీగా కాలుష్యరహితంగా నెట్ జీరో కాన్సెప్టుతో నిర్మిస్తున్నాం. అమరావతిని శాశ్వత రాజధానిగా పార్లమెంటు చట్టబద్ధత కల్పించింది. తిరుపతిలో స్పేస్ సిటీ, ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, గ్రీన్ హైడ్రోజన్, విశాఖలో మెడ్ టెక్, అనంతపురంలో సెమీ కండక్టర్ ఉత్పత్తి కేంద్రాలు అభివృద్ధి చేస్తున్నాం. డేటా సెంటర్ సహా, ఏఐ మౌలిక సదుపాయాలను కూడా త్వరలోనే ప్రారంభించబోతున్నాం. 15 బిలియన్ యూఎస్ డాలర్లతో గూగుల్ అతిపెద్ద పెట్టుబడిని ఏపీలో పెడుతోంది. ప్రతీ పౌరుడికీ ఏఐ లాంటి సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలన్నదే మా లక్ష్యం. డిసెంబరు నుంచి అమరావతిలో క్వాంటం వ్యాలీ కూడా ప్రారంభం అవుతుంది. వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్‌తో పాటు ప్రతీ వెయ్యి మందికి ఒక స్టార్టప్ ను తీసుకురావాలని ఆలోచన చేస్తున్నాం. ఆర్టీఐహెచ్ ద్వారా స్టార్టప్ ఎకోసిస్టమ్ ను ప్రోత్సహిస్తున్నాం. ఐఐటీ చెన్నై, ఐబీఎం, వైసర్ సంస్థల భాగస్వామ్యంతో 45 లక్షల మందిని ఏఐ, క్వాంటం, డేటా సెక్యూరిటీలో నిపుణులుగా తీర్చిదిద్దుతాం. సాంకేతికతను అనుసరించటం కాదు...ఆవిష్కరణల స్థాయికి ఏపి ఎదిగేలా చర్యలు చేపడుతున్నాం. కొత్త సంస్థలు, నైపుణ్యం, క్వాంటం మౌలిక సదుపాయాలతో రాష్ట్ర భవిష్యత్తును నిర్మిస్తున్నాం. ఔషధాల ఆవిష్కరణ, వ్యవసాయ ఉత్పాదకత, రక్షణ పరిశోధన, లాజిస్టిక్స్, క్రయోజనిక్స్, ఫ్యాబ్రికేషన్, యాంప్లిఫైడ్ రీసెర్చ్ లాంటి రంగాల్లో వినూత్న ఆవిష్కరణలు వస్తాయి. డిజిటల్ లావాదేవీలు మరింత సురక్షితంగా మారే అవకాశం ఉంది. క్లైమేట్ మోడలింగ్ లాంటి అంశాలను చేపట్టవచ్చుని" ముఖ్యమంత్రి వెల్లడించారు.




## అంబేద్కర్ పేరును పలకడం కాదు.. ఆశయాల ఆచరణే ముఖ్యం

**అమరావతి :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయాల కొనసాగింపుపై ఆయన చేసిన ట్వీట్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

"అంబేద్కర్‌ని గుర్తు చేసుకోవడం అంటే ఆయన వారసత్వాన్ని అనుసరించడం కాదు.. ఆ ఆశయాలను ఆచరణలో పెట్టడం. ఆయన పేరును ఎన్ని సార్లు పలుకుతామన్నది కాదు.. ఆయన విజన్‌ను ఎంత స్థిరంగా ముందుకు తీసుకెళ్తామన్నదే ముఖ్యం. అదే ఆయనకు ఇచ్చే నిజమైన గౌరవం" అని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆయన ఒక ఆంగ్ల పత్రిక కోసం తాను రాసిన వ్యాసాన్ని కూడా పంచుకున్నారు. ఆ వ్యాసంలో అంబేద్కర్ వారసత్వాన్ని కేవలం జ్ఞాపకార్థకంగా కాకుండా.. సమానత్వం, న్యాయం, రాజ్యాంగ విలువలను పాలనలో ఆచరణలో పెట్టడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.

## వచ్చే ఏడాది హరిద్వార్‌లో కుంభమేళా: ప్రధాని మోదీ

**ఢిల్లీ :** వచ్చే ఏడాది ఉత్తరాఖండ్‌లోని హరి ద్వార్ లో కుంభ మేళా నిర్వహించనున్నట్లు ప్రధాని మోదీ వెల్లడిం చారు. కుంభమేళా నిర్వహణకు వీలుగా 'దేవ్‌భూమి'ని శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని..పుణ్యస్థలాల్లో ప్రజలు కూడా పరిశుభ్రతను పాటించాలని సూచించారు. భారతదేశ సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలు ప్రతిబింబించేలా కుంభమేళాను పరిశుభ్రంగా, వైభవంగా జరుపుకొందామన్నారు. దేశవ్యాప్తంగా భక్తులు ఆసక్తిగా ఎదురు చూసే మినీ చార్‌ధామ్ యాత్ర కూడా మరికొన్ని నెలల్లో ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్రంలో భక్తుల రాకతో స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయన్నారు. ఢిల్లీ-డెహ్రాదూన్ ఎకనమిక్ కారిడార్‌ను ప్రారంభించిన అనంతరం మోదీ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల వృద్ధిపై దృష్టిపెట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రారంభించిన 213 కిలోమీటర్ల హై-స్పీడ్, యాక్సెస్-కంట్రోల్డ్ హైవే ఢిల్లీ- డెహ్రాదూన్ మధ్య ప్రయాణ సమయాన్ని ఆరు గంటల నుంచి రెండున్నర గంటలకు తగ్గిస్తుందన్నారు. కొత్త ప్రాజెక్ట్ వల్ల ఈ ప్రాంత ఆర్థిక స్వరూపం పూర్తిగా మారిపోతుందని.. రోడ్లు, జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, రైల్వేలు, విమాన, జలమార్గాలు కలిసి దేశ భవిష్యత్ మార్గాన్ని నిర్దేశిస్తాయన్నారు.

## ఇకపై లోక్‌సభలో 850 స్థానాలు..?

**ఢిల్లీ :** నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ నెల 16న రెండు బిల్లులను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. ఈ రెండింటి గురించి పార్లమెంటరీ వ్యవహారాలశాఖ ఎంపీలకు సమాచారం ఇచ్చింది. ఆ ప్రతులను వారికి పంపింది.

నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లు ప్రతిపాదనల ప్రకారం.. రాష్ట్రాల్లో 815 వరకు లోక్‌సభ స్థానాలు పెంచనున్నారు. కేంద్ర పాలిత ప్రాంతాల్లో 35 వరకు స్థానాలు పెరిగే అవకాశం ఉంది. దీంతో మొత్తం లోక్‌సభ స్థానాలు 543 నుంచి 850కి చేరొచ్చని తెలుస్తోంది. లోక్‌సభలో ఇందుకు సంబంధించిన బిల్లు ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేసి చకచకా సీట్ల పెంపు కార్యక్రమం పూర్తిచేసి 2029 ఎన్నికల్లో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది.

సీట్ల పెంపు దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా పెరుగుతాయని సమాచారం. జనగణన తర్వాత అందులో వచ్చిన లెక్కల ఆధారంగా దామాషా ప్రకారం సీట్ల పెంపునకు అనుమతిస్తే ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య తేడా వచ్చే అవకాశం ఉందని తొలినుంచి దక్షిణాది రాజకీయపార్టీలు ఆందోళన వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో.. అన్ని రాష్ట్రాల్లో సగటున లోక్‌సభ, అసెంబ్లీ సీట్లు 50% పెంచాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీనివల్ల అన్ని రాష్ట్రాలకూ ఇప్పుడున్న రాజకీయ ప్రాతినిధ్యం యథాతథంగా కొనసాగే అవకాశం ఉంటుందని సమాచారం.

**సమావేశం కానున్న ఇండియా కూటమి..**

నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై బుధవారం ఇండియా కూటమి నేతలు భేటీకానున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఈ సమావేశం జరగనుంది. బిల్లులో ప్రతిపాదించిన అంశాలపై సమాచారం అందిన నేపథ్యంలో.. వాటిపై చర్చించనున్నారు.

## ప్రమాదంలో యూకే జాతీయ భద్రత : నాటో మాజీ చీఫ్

**అమెరికా :** బ్రిటన్ రక్షణ బడ్జెట్ అంశంపై ఇటీవల తీవ్ర చర్చ జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో నాటో (చీఫ్) మాజీ చీఫ్ జార్జ్ రాబర్ట్‌సన్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయ ఉదాసీనత, రక్షణ రంగంలో తక్కువ పెట్టుబడుల కారణంగా బ్రిటన్ జాతీయ భద్రత ప్రమాదంలో పడిందన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ తీరుపై విమర్శలు గుప్పించారు.



తాము సంసిద్ధతతో లేమని, తమపై దాడి జరుగుతోందని జార్జ్ రాబర్ట్‌సన్ పేర్కొన్నారు. బ్రిటన్ జాతీయ భద్రత, రక్షణ ప్రమాదంలో ఉన్నాయన్నారు. గతంలో నాటో సెక్రటరీ జనరల్‌గా పనిచేసిన రాబర్ట్‌సన్.. బ్రిటన్ రక్షణ సామర్థ్యాలను సమీక్షించేందుకు స్టార్మర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి నాయకత్వం వహించారు.

**ఇక్కడేమైనా జరిగితే.. ప్రపంచానికి ఉక్కపోతే..!**

రక్షణ రంగంలో పెట్టుబడులు తక్కువగా ఉండటానికి ప్రత్యర్థి కన్జర్వేటివ్ పార్టీ కారణమని స్టార్మర్ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఇరాన్ యుద్ధం తమకు మేల్కొలుపు కావాలని స్టార్మర్ చెబుతున్నప్పటికీ.. ఆయన మాటలకు, చర్యలకు పొంతన ఉండటం లేదని నాటో మాజీ చీఫ్ విమర్శించారు. ఆ రంగంలో అవసరమైన పెట్టుబడులు పెట్టేందుకు ప్రధాని సుముఖంగా లేరని ఆరోపించారు. సైనికేతర నిపుణులు తీసుకుంటున్న నిర్ణయాలు బ్రిటన్ ఖజానాను ధ్వంసం చేస్తున్నాయని దుయ్యబట్టారు.



# హంగేరిలో కొత్త గాలి

పశ్చిమాసియా మొదలుకొని ప్రపంచం నలుమూలల నుంచీ దుర్వార్తలే వింటున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఇది మరో పిడుగుపాటు. పదహారేళ్ళుగా హంగేరిని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలుతున్న కన్సర్వేటివ్ జాతీయవాది, ప్రధాని విక్టర్ ఒర్బాన్ ఘోరంగా ఓటమిపాలయ్యారు. 199 స్థానాలున్న పార్లమెంటుకు ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఆయన పార్టీ ఫిడెస్‌కి కేవలం 55 స్థానాలు మాత్రమే రాగా, ఆయన్నుంచి విడిపోయి, మధ్యేవాద మితవాద పక్షం టీసా పార్టీని స్థాపించిన పీటర్ మాజార్‌కు అనూహ్యంగా 138 స్థానాలు లభించాయి. తీవ్ర మితవాద పక్షం అవర్ హోంల్యాండ్‌కు 6 దక్కాయి. తుది ఫలితాలు అధికారికంగా ప్రకటించాల్సివుంది.

ఎన్నికల సంఘం మొదలుకొని న్యాయవ్యవస్థ, మీడియా వరకూ అన్నిటినీ అధీనంలోకి తెచ్చుకుని తిరుగులేని అధికారం చలాయిస్తున్న ఒర్బాన్ ఓటమిని ఎవరూ ఊహించలేదు. ఆయనపై ప్రజానీకంలో తీవ్ర వ్యతిరేకత ఉన్నదని స్వతంత్ర సర్వే సంస్థలు చెప్పినా ఎవరూ నమ్మలేదు. టీసా పార్టీ దాదాపు 6 శాతం పాయింట్ల ఆధిక్యత తెచ్చుకుంటేనే కనీసం సాధారణ మెజారిటీ కూడా అసాధ్యమని కొన్ని మీడియా సంస్థలు చెప్పగా... అధికార పార్టీకన్నా టీసా పది పాయింట్లు వెనకబడివుందని ప్రభుత్వ అనుకూల మీడియా ఢంకా బజాయించింది.

ఈ ఎన్నికల సందర్భంగా హంగేరి ఏమాత్రం పొంతనలేని రెండు భిన్న ప్రపంచాలు చూసింది. అధికారపక్షం వైపు మొగ్గే ప్రపంచం ఒర్బాన్ మరో నాలుగేళ్లు ఏలబోతున్నారంటూ మోత మోగించింది. అందులో మీడియా సంస్థలూ, సామాజిక మాధ్యమాలూ, ‘సాధారణ పౌరులూ’ ఉన్నారు. అటు పీటర్ మజార్‌ను సమర్థించే ప్రపంచం అందుకు భిన్నమైన విశ్లేషణలు చేసింది. ఈ రెండింటిలో ఏదో ఒకటి మాత్రమే ‘నిజమైన ప్రపంచం’ అయివుంటుందని అందరికీ తెలుసు. సోమవారం ఓట్ల లెక్కింపు తర్వాత ‘నకిలీ ప్రపంచం’ బట్టబయలైంది.

ఒర్బాన్ హంగేరికి మాత్రమే పరిమితమైన సాధారణ నాయకుడు కాదు. ఆయన్ను అధికార పీఠం ఎక్కించిన ఫార్ములా దేశదేశాల నాయకులకూ శిరోధార్యంగా మారింది. సంప్రదాయవాదాన్నీ, జాతీయవాదాన్నీ నెత్తికెత్తుకుని ప్రజల భావోద్వేగాలను ఉచ్ఛస్థితికి తీసుకెళ్లటం ఎలాగో ఒర్బాన్ నేర్పారు. అమెరికాకు మాత్రమే కాదు... ప్రపంచానికంతకూ పెను సమస్యగా మారిన ట్రంప్ ఆయన స్ఫూర్తితోనే మాగా (మళ్లీ అమెరికాను మహోన్నతం చేద్దాం) ఉద్యమానికి అంకురార్పణ చేశారు.

ఒర్బాన్‌కు ట్రంప్, పుతిన్ సన్నిహితులు. వారిద్దరి మాదిరే ఈయూతో వైరం. ఒర్బాన్ మార్కు ఏలుబడికి ఇంటా బయటా శత్రువులు అవసరం. వారు-- ఈయూ, కమ్యూనిస్టులు, వలసదారులు, శతకోటీశ్వరుడు, దాత జార్జి సోరోస్-- ఎవరైనా కావొచ్చు. అభద్రతా భావన కూ. విదేశీ బెడదకూ, సమాజంలోని నైతిక పతనానికీ, ఇతరత్రా ప్రమాదాలకూ సర్వరోగ నివారిణి తాను మాత్రమేనని ఒర్బాన్ పదహారేళ్లపాటు నమ్మించగలిగారు.

‘సూపర్ మెజారిటీ’ వచ్చినా పాలనపై పూర్తిస్థాయి పట్టు సంపాదించటం టీసా పార్టీకి అంత సులభం కాదు. ఎందుకంటే సకల అధికార వ్యవస్థలూ ఒర్బాన్ అనుకూలురతో నిండివున్నాయి. ఆర్థిక సంస్థలూ, అధికార యంత్రాంగం, ఎన్నికల సంఘం, అవినీతి నిరోధక విభాగం వగైరాలన్నీ ఆయన మనుషుల చెప్పుచేతల్లో నడుస్తున్నాయి. ఈయూ నుంచి బయటికొస్తేనే సకల సమస్యలూ పరిష్కారమవుతాయని ఆయన చెప్పిన మాటలు విశ్వసించబట్టే ఆర్థికంగా అధోగతిలోవున్నా జనం నమ్మారు. ఒర్బాన్ అనుకూల వ్యాపార సంస్థలు మాత్రమే లాభార్జనతో కళకళలాడాయి.

నిరుద్యోగం పదేళ్ల రికార్డును అధిగమించింది. నిరుడు ఆర్థిక వృద్ధి 0.4 శాతం. కొన్నేళ్లుగా కష్టాల్లోవున్న పోలెండ్ సైతం 3.6 వృద్ధి రేటు సాధించగా... బల్గేరియా, రుమేనియా సైతం మెరుగ్గా ఉన్నాయి. ఇక అవినీతిలో హంగేరిది అగ్రస్థానం. ఇరాన్ శాంతి చర్చలకన్నా ముందు, ఒర్బాన్ గెలుపుకోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హంగేరి వెళ్లి ప్రచారం చేశారు. కానీ ఇరాన్ శాంతి చర్చల మాదిరే, ఒర్బాన్ కూడా కుప్పకూలారు. ఆయన ఓటమితో ఈయూ దేశాలు పండగ చేసుకుంటున్నాయి. హంగేరి ప్రజలు తమతోనే ఉన్నారని సంబరపడుతున్నాయి. కానీ అధోగతిలోవున్న హంగేరికి అందరూ ఆపన్న హస్తం అందించటం అత్యవసరం.

# వలంద పాలెం యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ 135 వ జయంతి

**(వి న్యూస్ – మచిలీపట్నం):** భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని మచిలీపట్నం స్థానిక వలంద పాలెం యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో మచిలీపట్నం నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు , మచిలీపట్నం అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ అబ్దుల్ మతీన్, పీసీసీ డెలిగేట్ కోకా ఫణి భూషణ్ లు పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి మిఠాయిలు పంచి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా



అబ్దుల్ మతీన్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని రాజ్యాంగం భారత రాజ్యాంగం అని ప్రతి పౌరుడికి సమాన హక్కులు సమాన గౌరవం కల్పించిన ఘనత అంబేద్కర్ దే అని అన్నారు. కులం మతం ప్రాంతం భాష లలో అసమాన తలను తొలగించి సమానుత్వాన్ని నిరూపించి అందరికీ సమాన అధికారాలను కట్టబెట్టారన్నారు. ఈ సందర్భంగా వేడుకల నిర్వాహకులను అబ్దుల్ మతీన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మేడపాటి చిట్టిబాబు, కార్య కిషోర్ కుమార్, సల్లా దిలీప్ కుమార్, అరిసె నాగ, అవినాష్, హర్ష, జాన్, వలంద పాలెం స్థానికులు యువకులు పాల్గొని మజ్జిగ ను పంపిణీ చేశారు. జై భీమ్, జై బాబాసాహెబ్, భారత రాజ్యాంగం వర్ధిల్లాలి అని నినాదాలు చేశారు.

# తుని నుండి గుంటూరు కు అక్రమ రవాణా

**(వి న్యూస్ – మచిలీపట్నం):** కృష్ణా జిల్లా మచిలీపట్నంలో అక్రమంగా ఆవులను తరలిస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. మచిలీపట్నం నుండి పెడన 216 హైవేపై హర్ష కాలేజ్ సమీపంలో అనుమానాస్పదంగా ఆవులను తరలిస్తుండగా స్థానికులు గమనించారు. వెంటనే వారిని అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. అక్రమ రవాణాకు సంబంధించిన వివరాలు సేకరిస్తూ, ఇందులో పాల్గొన్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా చర్యలు కొనసాగిస్తున్నారు. ఆవులను స్థానిక గోశాలకు తరలించారు.




# ఈ నెల 17న అవనిగడ్డ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో జాబ్ మేళా

**(వి న్యూస్ – అవనిగడ్డ):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు ఏప్రిల్ 17 శుక్రవారం ఉదయం 09 గంటలకు అవనిగడ్డలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్



డి.కె.బాలాజీ తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో టాటా ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఎన్ఎస్ ఇన్స్ట్రుమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, కోల్గేట్-పల్మోలివ్ లిమిటెడ్, అపోలో టైర్స్ లిమిటెడ్, ముత్తూట్ మనీ లిమిటెడ్, ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్, మెడ్ప్లస్ ఫార్మసి, మోహన్ స్పింటెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, పేటిఎమ్ సర్వీసెస్ లిమిటెడ్, సుధీర్ గ్రూప్ వంటి ప్రముఖ కంపెనీల వారు పాల్గొంటున్నారని, 600కు పైగా వివిధ ఉద్యోగాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డా. పి.నరేష్ కుమార్ తెలిపారు. ఈ కంపెనీలలో గల ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, ఫార్మసి పూర్తిచేసిన 18 నుండి 35 సంవత్సరాల లోపు యువత అర్హులని, ఎంపిక అయిన వారికి మంచి వేతనము, ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు కలవని, ఏప్రిల్ 17న నిర్వహించబోయే జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం ద్వారా సదరు ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. సదరు జాబ్ మేళాకు రెజ్యూమె లతో లేదా బయోడేటా ఫోరమ్ లతో పాటు ఆధార్, ఆధార్ కు లింక్ అయిన ఫోన్ నంబర్, పాన్ సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 63006 18985, 79955 34572 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించిన బండి రామకృష్ణ

**(వి న్యూస్ – మచిలీపట్నం)::** అంబేద్కర్ సర్కిల్లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించిన జనసేన పార్టీ ఇంచార్జ్ డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, జనసేన పార్టీ ముఖ్యులు. ఈ సందర్భంగా బండి రామకృష్ణ మాట్లాడుతూ సమ సమాజ స్థాపనకు అంబేద్కర్ కృషి



మరువలేనిదని అంటరానితనం పై వారు చేసిన పోరాటం తో పాటు ఓటు హక్కు ప్రతి ఒక్కరికి కల్పించారని వారు చేసిన పోరాట ఫలితమేమనకు ఓటు హక్కు వచ్చిందని పేర్కొన్నారు. ఓటు ద్వారా ప్రజలు ఎన్నుకున్న ప్రజాస్వామ్యం ఏర్పాటు జరుగుతుందని తెలిపారు. భారతదేశానికి అతి పెద్ద రాజ్యాంగం అందించిన మహనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గడ్డంరాజు,మహమ్మద్ సమీర్,కర్రీమహేష్,ఈవనమణిబాబు,మోకారవి, వడ్డీచిరంజీవి,కురుపయేసు,జన్నునాగరాజు,పినిశెట్టివేణు,బండికరుణాకర్, త్రిపురారి తరుణ్,వేముల చక్రి,పెదసింగుచిరంజీవి, సంకులనాని,మంత్రిపృథ్వి, తోటయశ్వంత్,తోటభాస్కర్, నరహరిశెట్టి రామ్ జ్యోతి ,బొద్దులపవన్,ప్రశాంత్,పలనియప్పరెడ్డికోటి,మహమ్మద్ భాషి,వంపుగడవల చరణ్,జన్ను వసంతరావు,ఏడుంబాకులవాసు,అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధి మనందరి బాధ్యత : గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**(వి న్యూస్ – గుడ్లవల్లేరు):** దేవాలయాల్లో ఆధ్యాత్మిక వైభవాలను పెంపొందించేలా ప్రతి ఒక్కరు భక్తి భావంతో కృషి చేయాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆలయాల పరిరక్షణ మనందరి బాధ్యత కావాలన్నారు. గుడ్లవల్లేరు మండలం కౌతవరం గ్రామంలో ప్రసిద్ధిగాంచిన గౌతమేశ్వర స్వామి వారి దేవస్థానం, శ్రీ చెన్నకేశవ స్వామివారి ఆలయాల ధర్మకర్తల కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం జరిగాయి. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే రాముకు ఆలయాల సంప్రదాయం ప్రకారం, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధర్మకర్తల కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయాలకు ధర్మకర్తల కమిటీ సభ్యులుగా నియమితులైన వారు, దేవాలయాలను పరిరక్షించడం, అభివృద్ధి చేయడం అందరి బాధ్యతగా భావించాలనీ సూచించారు. ఆలయ పవిత్రత, ఆధ్యాత్మిక వైభవాలను పెంపొందించేలా భక్తుల సహకారంతో కమిటీలు పనిచేయాలన్నారు. దేవాలయాలు మన సంస్కృతికి, సంప్రదాయాలకు నిలువు నిచ్చెనలన్నారు. వాటి పవిత్రతకు భంగం కరగకూడదన్నారు. ఈ దిశగా మన దేవాలయ కమిటీలు కృషి చేయాలని కోరారు. ముందుగా శ్రీ గౌతమేశ్వర స్వామి వారి దేవస్థాన కమిటీ చైర్మన్ గా తూము బసవశంకరరావు, ధర్మకర్తల కమిటీ సభ్యులుగా బి వెంకటరమణ,సిహెచ్ నలిని, ఎన్ విజయలక్ష్మి,



వి భారతి, ముద్దాల వెంకటేశ్వరరావు బాధ్యతలు చేపట్టగా శ్రీ చెన్నకేశవ స్వామి వారి ఆలయ కమిటీ చైర్మన్ గా కొల్లి మృదుల, ధర్మకర్తల కమిటీ సభ్యులుగా కొండిశెట్టి శాంతి కుమారి, తుమ్మలపల్లి సామ్రాజ్యం, మాగంటి విజయ లక్ష్మి, నరేపాలెం శివకుమారి,దొడ్డ నాగరాణి,ఈడే జయలక్ష్మి విన్నకోట కనకదుర్గ,ఈడే వీర రాఘవమ్మ లు బాధ్యతలు స్వీకరించారు. నూతన ధర్మకర్తల కమిటీ సభ్యులను ఎమ్మెల్యే రాము, కూటమి నాయకులు భక్తులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ సాయన పుష్పవతి, మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవి, దేవాదాయ శాఖ తనిఖీ అధికారి ప్రసాద్, ఈవో శేఖర్, శ్రీ కొండలమ్మ దేవస్థానం కమిటీ చైర్మన్ ఈడే మోహన్ ,టిడిపి నాయకులు గద్దె బాబురావు, పోలవరపు వెంకటరావు, కొడాలి రామరాజు, పీఏసీ చైర్మన్లు బాబి, డీసీ పాలేటి అంజనీయులు,యుగంధర్ జనసేన అధ్యక్షులు తోట చిన్నారి, నాయకులు పేర్ని జగన్,కౌతవరం గ్రామ నాయకులు మళ్లీ పెద్ద సుబ్రహ్మణ్యం, జోజీ, తూము శంకర్,కొల్లి నాన్జి, చిట్టిబొమ్మ ,నరసింహారావు కంచర్ల ప్రకాష్, ఈడే కృష్ణ , పలు గ్రామాలకు కూటమి నాయకులు, నీటి సంఘాల అధ్యక్షులు, దేవాలయాల భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# 2036 ఒలింపిక్ బిడ్‌కు గుర్తుగా 2,036 మొక్కలు నాటనున్న ఏపీఓఏ

(వి న్యూస్ – విజయవాడ): 2036 లో ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వాలన్న భారతదేశపు ప్రతిపాదిత బిడ్‌కు గుర్తుగా, రాష్ట్రవ్యాప్తంగా 2,036 మొక్కలను నాటాలని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం (ఏపీఓఏ) నిర్ణయించింది. జూన్ 23న పాటించే అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. మంగళవారం విజయవాడలోని ఒక హోటల్‌లో, ఏపీఏఓ అధ్యక్షుడు ఆర్‌కె పురుషోత్తం అధ్యక్షతన జరిగిన ఏపీఓఏ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం), కార్యనిర్వాహక కమిటీ (ఈసీ) సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా మొక్కల పెంపకం కార్యక్రమాలతో కూడిన వేడుకలను నిర్వహించాలని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పీటీ ఉష జారీ చేసిన సర్క్యులర్ నేపథ్యంలో ఈ తీర్మానం చేశారు. ఐఓఏ మార్గదర్శకాలకు అనుగుణంగా, చిత్తూరు జిల్లాకు చెందిన విశ్రాంత బ్యాంక్ మేనేజర్, మాజీ జాతీయ హాకీ క్రీడాకారుడు అయిన డీఎస్ వెంకటరామ నాయుడును ఏపీఓఏ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా (సీఈఓ) ఏజీఎం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సమావేశంలో సుమారు 15 అంశాలపై చర్చించారు; వీటిలో జూన్ 23న ఒలింపిక్ డే రన్ నిర్వహణ, మేఘాలయలో జరగనున్న 39వ జాతీయ క్రీడల్లో పాల్గొనడం, అలాగే జిల్లా, రాష్ట్ర మరియు జోనల్ స్థాయిల్లో ఒలింపిక్ తరహా పోటీలను నిర్వహించడం వంటి అంశాలు ఉన్నాయి. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల సహకారం




తో, ప్రభుత్వ కార్యాలయాలు మరియు బహిరంగ ప్రదేశాలతో సహా అన్ని జిల్లాల్లోని ప్రముఖ ప్రదేశాల్లో ఈ మొక్కల పెంపకం కార్యక్రమాన్ని చేపడతామని ఆర్‌కె పురుషోత్తం తెలిపారు. 2036 ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వాలన్న దేశ ఆకాంక్షకు ఈ కార్యక్రమం ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. పూర్వపు 13 జిల్లాల్లోని ఒలింపిక్ సంఘాలకు ఎన్నికలు త్వరలో నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్ర క్రీడా సంఘాలు ఆసక్తి వ్యక్తం చేస్తే, ఈ వ్యవస్థను 26 జిల్లా యూనిట్లకు విస్తరించేందుకు కృషి చేస్తామని ఆయన జోడించారు. ఆంధ్రప్రదేశ్ సైక్లింగ్ సంఘానికి ఎన్నికలు నిర్వహించడానికి సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అనుమతి (క్లియరెన్స్) ఇచ్చిందని పురుషోత్తం తెలిపారు. ఐఓఏ నుండి ఆర్థిక సహాయంతో, జిల్లా, రాష్ట్ర దక్షిణ మండల (సౌత్ జోన్) స్థాయిలలో ఒలింపిక్ తరహా పోటీలను నిర్వహించడానికి ఏపీఓఏ ప్రణాళిక రచిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇతర అంశాలపై మాట్లాడుతూ, ‘ప్రాజెక్ట్ గాండీవ’లో జరిగినట్లు ఆరోపణలు ఉన్న అవకతవకలపై సీఐడీ విచారణ తుది దశకు చేరుకుందని ఆయన తెలిపారు. క్రీడా కోటా కింద జరగాల్సిన నియామకాల ప్రక్రియ, అలాగే ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) నివేదిక ప్రస్తుతం న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయని ఆయన ప్రస్తావించారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న జూడో సంఘం వివాదం పరిష్కారమైందని, ఆనం కిషోర్ రెడ్డి నేతృత్వంలోని సంఘానికి జూడో సమాఖ్య ఓటు హక్కులను కల్పించిందని ఆయన తెలిపారు. అయితే, గతంలో ఒక నకిలీ సంఘానికి నిధులు విడుదల చేయడం వల్ల అవి దుర్వినియోగమయ్యాయని ఆయన ఆరోపించారు. మేఘాలయలో జరగనున్న 39వ జాతీయ క్రీడల కోసం ఏపీఓఏ రాష్ట్ర జట్లను కూడా సిద్ధం చేస్తోంది, ఈ క్రీడల్లో పాల్గొనడానికి అవసరమైన నిధుల కోసం శాప్ మద్దతును కోరింది. ఈ సమావేశంలో ఏపీఓఏ ఉపాధ్యక్షులు బడేటి వెంకటరామయ్య, నడెళ్ల బ్రహ్మాజీ రావు, కోశాధికారి శ్రీనివాస్, నూతనంగా ఎన్నికైన సీఈఓ డీఎస్ వెంకటరామ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారస్తుల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 జయంతి





**(వి న్యూస్ – పిడుగురాళ్ల):** పిడుగురాళ్ల పట్టణంలోని పిల్లుట్ల రోడ్డు వద్ద భారత నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 జయంతిని చిరు వ్యాపారస్తుల సంఘం ఆధ్వర్యంలో రామ ఇశ్రాయేలు సంద్రపాటి నాగేశ్వరావు సహకారంతో జయంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అంబేద్కర్ ప్రచార సేవాసమితి అధ్యక్షులు దేగలఆబ్రహం అధ్యక్షత వహించగా పట్టణ సీఐ వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. అంబేద్కర్ అమూల్యమైన భారత రాజ్యాంగాన్ని మనకు అందించారని, రాజ్యాంగాన్ని రచించేటప్పుడు దేశ జనాభా 35 కోట్లని, నేడు భారతదేశ జనాభా 147 కోట్ల అన్నారు. ఇప్పటికీ రాజ్యాంగం చెక్కుచెదరలేదని, ఇందులోనే అంబేద్కర్ మేధాశక్తిని మనకీ అర్థం చేసుకోవచ్చని, ఓటు హక్కు ప్రతి ఒక్కరికి కల్పించారని, మహిళల కోసం హిందూ కోడ్ బిల్లు వీగిపోయేసరికి తన భారత తొలి న్యాయశాఖ మంత్రిగా ఆ పదవికి రాజీనామా చేసి పార్లమెంట్ నుండి బయటకు వచ్చారని, చౌదర్ చెరువు ఉద్యమం, దేవాలయ ప్రవేశం కోసం ఉద్యమం ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో గొప్ప పోరాటాలు చేశారని, విలేజి నుండి విశ్వం వరకు ఎదిగారని, అంబేద్కర్ సేవలను కొనియాడారు. తాళ్లూరి అమర్నాథ్ వర్లఆగస్టీన్ సంపత్ వెంకట్ యాదవ్ కోమ్ము అబ్రహం ఎస్సీ ఎస్టీ ఎస్సి, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు మందా రవి, వాయిరివెంకటరావు,
మంద మోహన్, ఉసిరికాయల అంకారావు, మంద యెహోషువ, బుర్రి వెంగలరెడ్డి, మీసాల లాజరు, సంద్రపాటీ ఓబులు, ఇనుముక్కల పిచ్చయ్య, మైల నాగరాజు, బందులూరి బాబు, కందుకూరి దావీదు, వేసుపోగు యోబు, బోడేపూడి జీవా, షేఖ్ నాగులు మీరా, దేగలయోహాను, బంక శరత్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రపంచ మేధావి భారతరత్నడాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఘన నివాళులు




**(వి న్యూస్ – రాజుపాలెం):** పిడుగురాళ్ల –రాజుపాలెం కెఎన్ఆర్ విద్యాసంస్థల నందు భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పిస్తూ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కోనేటి నరసింహారావు బాడిన మస్తాన్ రావు మాట్లాడుతూమహానుభావుడైన భారతరత్న బిఆర్ అంబేద్కర్ ఆయన భారత రాజ్యాంగ నిర్మాతగా, సామాజిక సంస్కర్తగా, విద్యకు ప్రాముఖ్యత ఇచ్చిన గొప్ప నాయకుడిగా మనందరికీ ఆదర్శప్రాయుడు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పిన ఒక గొప్ప మాట విద్య పొందండి, సంఘటితం అవ్వండి, పోరాడండి ఇది ప్రతి విద్యార్థి జీవితంలో మార్గదర్శకంగా ఉండాలని,అంబేద్కర్ జీవితాన్ని చూస్తే మనకు ఒక గొప్ప పాఠం తెలుస్తుంది. విద్యే మనకు నిజమైన శక్తి. మీరు ఎంత కష్టపడి చదివితే, అంత గొప్ప స్థాయికి ఎదగగలరు.మన సమాజంలో సమానత్వం, న్యాయం, సోదరభావం పెరగాలంటే, మనం మంచి పౌరులుగా మారాలి. అంబేద్కర్ ఆలోచనలు మనకు మార్గదర్శకం.ఈ సందర్భంగా మనం ఒక ప్రతిజ్ఞ చేద్దాం,మంచి విద్యను సాధిద్దాం,సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగదాం,అందరికీ గౌరవం ఇవ్వడం నేర్చుకుందాం,కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సాదినేని నరసింహారావు తెలకపల్లి గోపికృష్ణ,ఆలూరి ప్రసన్నకుమార్, బి. ఇందు, స్రవంతి విద్యార్థిని విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు.


V స్మార్ట్ యాడ్స్

**Insurance**
యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అన్ని రకాల వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించబడును. ఇన్సూరెన్స్ చేయించుకోదలచిన వారు సంప్రదించండి: టి.సి.ఎన్ శ్రీనివాస్. 9246761404 08672-221097

**మస్కిటో డోర్స్&విండోస్**
చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్... అల్యూమినియమ్ మస్కిటో డోర్స్&విండోస్ తయారు చేయబడును. మరియు రిపేర్ చేయబడును. సంప్రదించండి: చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్ గొడుగుపేట-మచిలీపట్నం సెల్:9182197822 9121605277

వి స్మార్ట్ యాడ్స్ కేవలం రూ.100/-లకే స్మార్ట్ యాడ్..
- - - - - - - - - - -
సంప్రదించండి 9848667347

**చెదల నివారణకు**
K. Vasantha Rao

DAYA PEST CONTROLLING WORK
Cell: 8333099449
నివారణ గ్యారెంటీ... మచిలీపట్నం.

**శ్రీ శివరామకృష్ణ జ్యోతిష్యాలయము**
శంకర మఠం ప్రక్కన, గొడుగుపేట, మచిలీపట్నం.
జాతక పరిశీలన చేసి వివాహ, ఉద్యోగ, వ్యాపార, సంతాన తదితర విషయాల్లో దోషాలకు పరిహారాలు సూచింపబడును.
వివాహ పొంతన పరిశీలింపబడును. సుముహూర్త నిర్ణయం చేయబడును.
సంప్రదించండి : 96407 54054-91828 17435

**తక్కువధరకే ప్రకటనలు**
ఇల్లు/స్థలం అమ్మలన్నా, కొనాలన్నా, అద్దెకు ఇవ్వాలన్నా, ఉద్యోగం కావాలన్నా, ఉద్యోగులు కావాలన్నా తక్కువ ధరతో విన్యూస్‌లో ప్రకటన ఇచ్చి నిశ్చింతంగా ఉండండి. మరిన్ని వివరాలకు సంప్ర: 9848667347


# మహిళా హక్కుల ప్రదాత అంబేద్కర్ - కెయూ ఉపకులపతి ఆచార్య కె రాంజీ



**(వి న్యూస్ – మచిలీపట్నం)::** ఈ దేశం లో మహిళల గురించి ఆలోచన చేసిన మొదటి వ్యక్తి డా. బిఆర్. అంబేద్కర్ అని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. రాంజీ అన్నారు. మంగళవారం డా. బిఆర్. అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలను కృష్ణా విశ్వవిద్యాలయం లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య కె. రాంజీ మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం డా. బిఆర్.అంబేద్కర్ ఆనాడే హిందూకోడ్ బిల్లు రూపొందించారని వివరించారు. దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన డా. అంబేద్కర్ అనేక గొప్ప రచనలు చేసి దేశానికి అందించిన మేధావి అని పేర్కొన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆయన కష్టనష్టాలకు ఓర్చి ఉన్నత చదువులు చదివి విజ్ఞాన ఖని గా గుర్తింపు పొందారు అని వివరించారు. ప్రముఖ రచయిత, విశ్రాంత వాణిజ్యపన్నుల శాఖాధికారి బోనిగల రామారావు ప్రధానోపన్యాసం చేశారు. కార్యక్రమంలో జీవిత బీమా ఉద్యోగ సంఘ నాయకులు కిశోర్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వైకే సుందరకృష్ణ పలువురు సహాయ ఆచార్యులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత డా. బిఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# జోరుగా గుట్కా వ్యాపారం



**(వి న్యూస్ – పిడుగురాళ్ల):** పిడుగురాళ్ల మండలంలో మంచినీరు దొరకని షాపులు ఉన్నాయేమో గానీ గుట్కా, ఖైనీ ప్యాకెట్లు లేని షాపులు లేవంటే అతిశయోక్తి కాదు. ప్రజల ఆరోగ్యభద్రత రీత్యా ప్రభుత్వం గుట్కా, ఖైనీ ప్యాకెట్లను నిషేధిస్తే గుట్కా అక్రమ విక్రయదారులకు ఇదొక వరంగా మారింది. వీటిని యదేచ్ఛగా, గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు కొనసాగిస్తూ ఒక్కొక్క ప్యాకెట్ ధరను పది రెట్లు పెంచి జేబులో సొమ్ములు నింపుకుంటున్నారు. కొంతమంది ఇదే అదనుగా నకిలీ గుట్కా ప్యాకెట్లను సైతం విక్రయించడం కలవరపరిచే విషయం, పోలీసులు అడపాదడపా కేసులు నమోదు చేస్తున్నా వాటి ప్రభావం గుట్కా విక్రయదారులపై ఎంతమాత్రం లేదు.
గతంలో సత్తెనపల్లి డిఎస్పి కాలే షావలి గుట్కా విక్రయదారులను పట్టుకుని, ఈసారి విక్రయించినట్లు తెలిస్తే మీ ఆస్తులు జప్తుచేస్తామని హెచ్చరించి అప్పట్లో కేసులు నమోదు చేశారు. ఆ తర్వాత ఎక్కువగా వారిపై దృష్టి పెట్టకపోవడతో గుట్కా రాయుళ్లు భయపడక పట్టణంలో యధేచ్చగా తమ పని చేసుకుపోతున్నారు. పోలీసుల దాడుల తర్వాత వ్యాపారులందరూ ఒక సిండికేట్గా మారి పిడుగురాళ్ల మండలంతో పాటు చుట్టు. పక్కల మండలాల్లో యథేచ్ఛగా వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఈ గుట్కా విక్ర యానికి ప్రధాన రవాణగా షాప్ లకు సిగరెట్ ప్యాకెట్ లు , కురుకురే చిప్స్ ప్యాకెట్ లు వేసే విధంగా కొంతమందిని ఎంచుకుని, అనుమానం రాకుండా తరలిస్తున్నారు. ఒకవేళ దొరికినా చిన్న చిన్న కేసులతో బయటపడుతూ లక్షల్లో వ్యాపారాలు చేస్తూ అక్రమ ఆదాయం గడిస్తున్నారు. అలాగే పట్టణంలో ఒరిజినల్ గుట్కా ప్యాకెట్లను పోలిన నకిలీ ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి. వీటిని విక్రయించడం ద్వారా అధిక లాభం వస్తుండటంతో వ్యాపారులు వీటిపై దృష్టి సారిస్తున్నారు. పోలీసులు ఒక వేళ దాడులు చేసినా చిరువ్యాపారులపై కేసులు పెట్టడమే తప్ప అసలైన నిందితులను పట్టుకుని ప్రజల ఆరో గ్యాన్ని పరిరక్షించడంలో విఫలం అవుతున్నారు. ఇకనైనా స్టేట్ అధికారులు జిల్లా స్థాయి అధికారులు స్పందించి ఇప్పటికైనా ఈ అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# బోనస్ పంపిణి



**(వి న్యూస్ – హనుమాన్ జంక్షన్):** మంగళవారం సాయంత్రం 6.00 గంటలకు హనుమాన్ జంక్షన్ క్లస్టర్ పరిధిలోని కాకులపాడు పాల ఉత్పత్తి దారుల పరస్పర సహాయక సహకార సంఘం నందు 2025 – 2026 ఆర్థిక సంవత్సరం కు గాను మూడవ విడత నాలుగు నెలల బోనస్ 1,17,830 /- రూపాయలు 41 మంది పాల ఉత్పత్తి దారులకు ఛైర్మన్ చలసాని ఆంజనేయులు చేతుల మీదుగా అందజేయడం జరిగింది .అలాగే పశువులకు చూడి నిర్ధారణ చేసే సి బి టి కిట్టుల పనితీరు, తిరగపొల్లె పశువుల గర్భం పరిస్థితి ఏ విధంగా ఉన్నదో తెలియజేసే ఏ ఐ గన్ వినియోగం గురించి తెలియజేయడం జరిగింది. హనుమాన్ జంక్షన్ క్లస్టర్ పరిధిలో హనుమాన్ జంక్షన్ బి ఏం సి పరిధిలో చలసాని ఆంజనేయులు 9773 లీటర్లు , గోగులంపాడు బి ఎమ్ సి పరిధిలో యూ సత్యవతి 13485 లీటర్లు , పల్లెర్లమూడి బి ఎం సి పరిధిలో పర్వతనేని పవన్ కుమార్ 9660 లీటర్లు సరఫరా చేసి ప్రథమ స్థానంలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మాగంటి హరిబాబు ,ఏ ఎం పి ఓ బావిశెట్టి వెంకటేశ్వరరావు, సంఘ పాలక వర్గ సభ్యులు , పాల ఉత్పత్తి దారులు పాల్గొన్నారు .

# అంబేద్కర్ కు ఘన నివాళులు అర్పించిన గోపు



**(వి న్యూస్ – కానూరు):** మచిలీపట్నం నార్త్ మండలం కానూరు గ్రామంలో స్వర్ణ గ్రామము కార్యాలయం లో చిన్న కానూరు గ్రామము నందు డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలులో తెలుగుదేశం పార్టీ ప్రదాన కార్యదర్శి గోపు సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ఏప్రిల్ 14వ తేదీ 1891 లో మధ్యప్రదేశ్ లోని మోవ్ అనే గ్రామంలో జన్మించారు అని తెలిపారు,ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14న అంబేద్కర్ జన్మదినాన్ని పురస్కరించుకొని అంబేద్కర్ జయంతి గా జరుపుకుంటామని అని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా. బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించారు. విద్య, సంఘటితం, పోరాటం అనే మంత్రంతో కోట్లాది మందికి చైతన్యం నింపిన యుగపురుషుడు. కులవివక్ష చీకట్లను చీల్చి, సమానత్వ సూర్యుడిని ఆవిష్కరించిన మహామేధావి. ఆయన కలలు కన్న సమసమాజ స్థాపనకు మనమంతా కృషి చేద్దాం. రాజ్యాంగం మనకిచ్చిన హక్కులను తెలుసుకుని, బాధ్యతలను నిర్వర్తిద్దాం. చదువుకోండి, ఐక్యంగా ఉండండి, పోరాడండి అని చెప్పిన బాబాసాహెబ్ అంబేద్కర్ బాటలో నడుద్దాం అని తెలిపారు, ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వర ప్రసాద్, సుబ్బయ్య దాస్ వీ ఆర్ ఓ, దివి మహేష్, పీత రాము, గోపు వెంకటరమణ, బొల్లిశెట్టి నాని, గొవ్వాడ లక్ష్మణ, కమ్మగట్టి అశోక్, కుర్రెళ్ళ వీర్రాజు, రాంబాబు,ఆముదాలపల్లి వెంకటేశ్వరావు, బోట్ల రాజేష్,శీలం శేషుబాబు, విజయ్ , కమ్మగట్టి వెంకటేశ్వరావు, స్వర్ణ గ్రామ సిబ్బంది, బుక్ కీపర్స్ అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మచిలీపట్నంలో ఘనంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు



**(వి న్యూస్ – మచిలీపట్నం)::** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను మచిలీపట్నంలోని జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో, అంబేద్కర్ సర్కిల్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కృష్ణా జిల్లా బిజెపి అధ్యక్షులు తాతినేని శ్రీరామ్ ముఖ్య అతిథిగా హాజరై, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాతినేని శ్రీరామ్ మాట్లాడుతూ, అంబేద్కర్ చూపిన బాటలో నడుస్తూ ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎస్టీ మోర్చా అధ్యక్షులు మద్దుల మధుబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మరాజు , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంతం గజేంద్ర, జిల్లా జయంతి ఉత్సవాల కన్వీనర్ కురుమద్దాల ఫణికుమార్ , ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఏకుల విజయేంద్ర , జిల్లా ఉపాధ్యక్షులు మట్టా ఝాన్సీ , సోషల్ మీడియా కన్వీనర్ వి.వి. ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.జిల్లా , మండల పదాధికారులు, ఎస్సీ, ఎస్టీ మోర్చా నాయకులు, బిజెపి కార్యకర్తలు భారీగా తరలివచ్చి బాబాసాహెబ్ కృషినీ, ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు.

# సిఐటీయు యూనియన్ ఆధ్వర్యంలో జ్యుయలరీ పార్క్ వద్ద ధర్నా



**(వి న్యూస్ – మచిలీపట్నం):** ఉషా గోల్డ్ కవరింగ్ యాజమాన్యం కార్మికులపై దాడులు ఖండిస్తూ కృష్ణాజిల్లా ఇండ్రస్టియల్ అండ్ ఆటో మొబైల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు)మచిలీపట్నం కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి టి.చంద్రపాల్ మాట్లాడుతూ మార్చి 31వ తారీఖున పోతేపల్లి జ్యుయాలరీ పార్క్ లోని ఉషా గోల్డ్ కవరింగ్ కంపెనీలో దారుణమైన సంఘటన జరిగింది.ఉషా గోల్డ్ లో మేనేజర్ గా పనిచేస్తున్న పరిమి రవికుమార్ అనే వ్యక్తిని అతి దారుణంగా కిరాతకంగా బంధించి, రాడ్లతో కర్రలతో కొట్టి, మిరపకాయలు నూరి మర్మాంగాల్లో పెట్టిన విషయం పత్రికల్లో సోషల్ మీడియాలో వచ్చిన గాని ఇంతవరకు దాని మీద ఎలాంటి చర్యలు పోలీసు యంత్రాంగం తీసుకోలేదు. కావున మంగళవారం సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో జ్యుయలరీ పార్క్ వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. బాధితుడికి న్యాయం జరగాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.ఇలాంటి చర్యలు తీసుకునే యాజమాన్యంపై కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలని సిఐటియు మచిలీపట్నం కమిటీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి సుబ్రహ్మణ్యం, మచిలీపట్నం మండలసీఐటీయూ కార్యదర్శి సిహెచ్. జయరావు , ఐద్వా మహిళా సంఘం అధ్యక్షులు సిహెచ్. విజయలక్ష్మి, బూర భవాని, బాధతుడు పరిమి రవికుమార్, ముఠా, పార్క్, ఆటో కార్మికులు పాల్గొని మద్దతునిచ్చారు.

# సద్భావనా సమావేశం నిర్వహణ




**(వి న్యూస్ – కైకలూరు):** స్థానిక మండల పరిధిలోని మండల కేంద్రం, కైకలూరు నందుగల రామకృష్ణ సేవా సమితి లో మంగళవారం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో, కైకలూరు ఖండ నందు, హిందూ సమాజ పెద్దలతో సద్భావనా సమావేశం నిర్వహించడం జరిగింది .ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ, ఒకనాడు హిందూ సమాజము ఆధ్యాత్మిక, విద్య ,సాంస్కృతిక, సేవ, సామాజిక, ధార్మిక రంగాలన్నింటిలోనూ తలమానికంగా ఉండేదని, కానీ నేడు విదేశీ ఆక్రమణల, మత మార్పిడిలా కారణంగా నేటి సమాజం లో అవలక్షణాలు ఏర్పడడం ఒక విషాదకర వాస్తవం. సదరు పరిస్థితుల్లో, హిందూ సమాజంలోని లోపాలను సరిచేసుకుని హిందువుల ఐకమత్యాన్ని పెంపొందించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నొక్కి వక్కాణించారు. హిందూ సమాజ గత వైభవాన్ని పునస్థాపించగలిగే సత్తా సమాజంలోని అనేక కుల, ధార్మిక, ఆధ్యాత్మిక ,సమూహాల పెద్దలకు మాత్రమే ఉన్నదని ,ఈ విషయాన్ని ప్రతి పెద్ద గ్రహించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వక్తలు ఆర్ఎస్ఎస్ విజయవాడ విభాగ్ ప్రచారక్ నవీన్ జి,వణుదురు నందగిరి స్వామీ,పలువురు హిందూ సమాజ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# బంటుమిల్లి లో డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు




**(వి న్యూస్ – బంటుమిల్లి):** బంటుమిల్లి మండలం లక్ష్మీపురం సెంటర్, మల్లేశ్వరం, ముంజులూరు గ్రామాలలో భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకల్లో పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొని నివాళులు అర్పించారు.అనంతరం బంటుమిల్లి గ్రామంలో భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన రక్త శిబిరా కేంద్రని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు సమాజంలో అసమానతలను, కులవివక్షలను రూపుమాపి, ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ, సమాన హక్కులను కల్పించిన దార్శనికుడు, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అన్నారు.దళితులు,అణగారిన వర్గాల వారు కూడా చట్ట సభలలో ఎన్నికయ్యారు అంటే అంబేద్కర్ యొక్క కృషి ఫలితమే ఈరోజు మన దేశంలో అత్యున్నతమైన పదవి రాష్ట్రపతిగా ఒక దళిత మహిళ నియమించబడ్డారంటే అది మహనీయులు అంబేద్కర్ చలవే ఆయనను ఆదర్శంగా తీసుకొని యువత విద్యలో బాగా రాణించి ఉన్నతమైన శిఖరాలు అధిరోహించి రాబోయే తరాలకు ఆదర్శప్రాయంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ 135వ జయంతి



**(వి న్యూస్ – మచిలీపట్నం)::** బ్రహ్మ సమాజం, వైస్ మెన్ క్లబ్ ల సంయుక్త ఆధ్వర్యంలో డా అంబేద్కర్ జయంతిని స్థానిక అరవగూడెం లోని చిట్టా బాల కృష్ణ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు డా ఉడత్తు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు డా. ఉడత్తు మాట్లాడుతూ అంబేద్కర్ జయంతిని ఆనువాయిగా జరగడం ఆనందంగా వున్నదన్నారు ముఖ్య అతిధి చిలుకోటి ప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆ రోజులలో అనేక అవమానాలు పడ్డారని ఎవ్వరూ అటువంటి అవమానాలు పడరాదని వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పాటు పడాలని నొక్కి వక్కానించారు. విశిష్ట అతిథి లింగం మోసెస్ మాట్లాడుతూ అంబేద్కర్ అద్భుతాలు చేసారన్నారు. ఈ కార్యక్రమం లో డా ఉడత్తు శ్రీనివాసరావు, చిలుకోటి ప్రసాద్, లింగం మోసెస్, లింగం ఫిలిప్ తదితరులు ప్రశాంగించారు. తోలుత అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసారు.అతిధులను దుసశాలువాలతో సత్కరించారు.

# పులివెందులలో 15 కిలోల గంజాయి స్వాధీనం : జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్



**(వి న్యూస్ – పులివెందుల):** కడప జిల్లాలోని పులివెందులలో పోలీసులు భారీ ఆపరేషన్ నిర్వహించారు. గంజాయి మరియు నాటు సారాయి అక్రమ రవాణాపై దాడులు చేసి మొత్తం 18 మందిని అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, పులివెందుల డీఎస్పీ బి.మురళి ఆధ్వర్యంలో పులివెందుల అర్బన్ పోలీసులు ఈ ప్రత్యేక దాడులు చేపట్టారు. మంగళవారం ఉదయం కదిరి రింగ్ రోడ్ సమీపంలో గంజాయి రవాణా చేస్తున్న 10 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.అదే సమయంలో పులివెందుల పట్టణంలో నాటు సారాయి అమ్ముతున్న మరో 8 మందిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మంగళవారం మీడియా కు తెలిపారు. పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్ లో జిల్లా ఎస్పీ మీడియా సమావేశం లో ఎస్పీ కేసు వివరాలు వెల్లడించారు.అరెస్టు చేసిన వారి వద్ద నుంచి 110 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ప్రధాన నిందితుడు గొర్ల భరత్ యాదవ్‌కు పాత కేసులు ఉన్నట్లు, జైలు నుంచి విడుదలైన తర్వాత మళ్లీ ఈ వ్యాపారంలోకి దిగినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ నిందితులను రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. జిల్లాలో డ్రగ్స్, నాటు సారాయి అక్రమాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ కఠినంగా హెచ్చరించారు. వ్యవస్థీకృత నేరాలకు(ఆర్గనైజ్డ్ క్రైమ్)పాల్పడే వారి ఆస్తులు స్వాధీనం చేసుకుంటామని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు.ఆర్గనైజ్డ్ క్రైమ్ లో ప్రణాళిక ప్రకారం నేరం చేసి సంపాదించిన వారు, నేరంలో పాల్గొన్న వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవడంతో పాటు సీరియస్ గా పరిగణించి కఠిన శిక్ష విధించేలా చట్టంలో పొందు పరిచారన్నారు.

# విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



**(వి న్యూస్ – కైకలూరు):** స్థానిక మండల పరిధిలోని మండల కేంద్రం, కైకలూరు నందుగల సంత మార్కెట్ వద్ద, స్థానిక కైకలూరు నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో 29వ వార్షిక చలివేంద్రం ను, స్థానిక కైకలూరు శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్ చేతులమీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ, విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సామాజిక సేవలు నిర్వహించడం ఎంతో ఆనందం కలిగిస్తుందని, ఇదేవిధంగా మరిన్ని మంచి కార్యక్రమాలు రానున్న రోజుల్లో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఆయన తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కమ్మిలి విఠల్ రావు, అడవి కృష్ణ ,పూల రామచంద్రరావు, బూరు బోయిన శ్రీనివాసరావు, బొమ్మన బోయిన విజయలక్ష్మి విశ్వబ్రాహ్మణ సంఘం కైకలూరు నియోజకవర్గ అధ్యక్షులు తుపాకుల సోమాచారి, లక్కోజు సురేష్ మరియు సంఘ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి



**(వి న్యూస్ – మచిలీపట్నం):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఏ ఒక్క సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాదని, అందరికీ కావలసిన వ్యక్తిని సమాజంలో అసమానతలు తొలగించడానికి ఎంతగానో కృషి చేశారని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతినీ పురస్కరించుకుని తొలుత నగరంలోని లక్ష్మీ టాకీస్ సెంటర్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి మంత్రివర్యులు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు లతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రివర్యులు విచ్చేసి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ చైర్మన్ లతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు.జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ. అంబేద్కర్ మన దేశానికి మాత్రమే ఒక మేధావి కాదు. ప్రపంచంలో మేధావులు ఎవరు ఉన్నారు అని పెద్ద యూనివర్సిటీలు సర్వే చేసిన దాంట్లో మొదటి స్థానంలో అంబేద్కర్ నిలిచారన్నారు. రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ రసరాజు రాసిన అద్భుతమైన పాట వెలివేసిన చీకటిలో వీధి దీపమా, విసిరేసిన శూన్యంలో ఇంద్రచాపమా నీ చూపులు దేశానికి గొడుగులు. నీ అడుగులు వివక్షతకు పిడుగులు. అంటూ ఆలపించి అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ ఆనందకుమార్, రాష్ట్ర మైనార్టీ ఆర్థిక సంస్థ డైరెక్టర్ హసీం బేగ్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఫణి కుమార్, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచే నాని , జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గుమ్మడి విద్యాసాగర్, అర్బన్ బ్యాంకు చైర్మన్ దిలీప్ కుమార్ ,విశ్రాంత లెక్చరర్ మేరీ కృప బాయి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, సిపిఎం నాయకులు కొడాలి శర్మ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆదినారాయణ , ఎస్సీ నాయకులు బాలాజీ, వేముల కోటేశ్వరరావు, తదితర అధికారులు అనధికారులు వివిధ సంఘాల నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.


శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానము
(శ్రీ కంచికామాక్షి అమ్మవారి దేవాలయం)
సర్కిల్ పేట - మచిలీపట్నం
శ్రీ లక్ష్మీ గణపతి హోమ ఆహ్వానం
ది.5-03-2026 నుండి ది.15-04-2026 వరకు
శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో... లోక కళ్యాణార్ధము భక్తులందరికి శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారి అనుగ్రహము చేత విద్యార్థులకు సద్బుద్ధి, సత్ప్రవర్తన, అఖండ విద్యాభివృద్ధి, సమస్త విఘ్నములు తొలగుట, వివాహార్థులకు శీఘ్రముగా కళ్యాణ ప్రాప్తి, సంతానార్థులకు సంతాన ప్రాప్తి, దంపతులకు అన్యోన్యత-వ్యాపారాభివృద్ధి, కోర్టు వ్యవహారములో శీఘ్రముగా మంచి ఫలితమును పొందుట కొరకై మండల దీక్షగా
శ్రీ లక్ష్మీ గణపతి హోమము
బ్రహ్మశ్రీ రాళ్లపల్లి ఆంజనేయ శాస్త్రి గారి పర్యవేక్షణలో మరియు ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ అయిలూరి మల్లిఖార్జునరావు గారి సౌజన్యములో జరుపబడును.
ది.5-3-2026 నుండి 15-4-2026 వరకు
'గోపూజ, గణపతి పూజ'
శ్రీ లక్ష్మీ గణపతి దేవతారాధన
అష్ట ద్రవ్యములతో శ్రీ లక్ష్మీ గణపతి హోమం - పూర్ణాహుతి
ది.15-4-2026 బుధవారం
ఉదయం గోపూజ, గణపతి హోమము ,మహాపూర్ణాహుతి
శ్రీ సిద్ధి బుద్ధి సమేత శ్రీ గణపతి స్వామి వారి కళ్యాణ మహోత్సవము
మధ్యాహ్నం అన్నసమారాధన
యక్కల చంద్రశేఖర్
చైర్మన్
ధర్మకర్తల మండలి సభ్యులు :
ఆరేపు లక్ష్మణ కుమార్, నిడుమోలు ఓంకారేశ్వరరావు, కోనపాల శ్రీనివాసరావు, చొప్పరపు కనకదుర్గ, కానుకొలను హరితానాగలక్ష్మి అనుపమ, పత్తికాయల మంగ, పరాశరం పద్మజ, వంగర శ్రీలక్ష్మి
కొండవీటి మురళీకృష్ణ
కార్యనిర్వహణాధికారి


Owned by EDITOR and Publisher: PREM NATH THOKALA, 26/152, Buttaipet, Machilipatnam, Krishna Dist.,Printed at Sri Lakshmi Ofset Printer binders, D.no : 32-26-126/13, opp BSNL Bhavan, Chuttagunta, Vijayawada-4. ph:08672 227347.,cell 9848667347 - RNI NO: APTEL/2015/65279